# పందొమ్మిదవ ప్రసంగము

సంధ్యాసమయమున త్రిభువనభాయి అడిగెను:— మోహము, మమకారము అను బంధనములకు లోబడినవానిని అందునుండి విముక్తి నొందించు మార్గము కలదా?

## నిస్సంగుని సాంగత్యముచే ముక్తి.

స్వా. ని. :—కబీరు చెప్పెను :—

బంధేసే బంధా మిలా, ఛూటే కోన ఉపాయ,
సంగత కరియే నిర్బంధకీ, పలమేం దేయి ఛుడాయి.

“బంధమున నున్నవాడు బంధములోనున్న ఇంకొకరి నెట్లు విడిపించగల్గును. బంధవిముక్తుని సంగము వలన బద్ధుడు క్షణములో విముక్తుడగును.”

ఒక రాజునకు భాగవతమునందు మిక్కిలి భక్తి యుండెను. ఒక విద్వాంసుడగు పౌరాణికునిద్వారా పురాణశ్రవణము చేసెడివాడు. అయిదారు సంవత్సరములు నియమానుసారము భాగవతమును వినెను. ఒకరోజున ఆయన పౌరాణికుని ప్రశ్నించెను:— “పరీక్షిన్మహారాజునకు ఏడురోజులు వినినంతమాత్రముననే ప్రభుదర్శనమయ్యెను. నేను ఇన్ని రోజులనుంచి శ్రవణము చేయుచున్నాను. అయినను నాకు ప్రభువు కనిపించలేదేమి?” ఆ పౌరాణికునకు సమాధానము తోచలేదు. మూడు రోజులలో సమాధానము చెప్పెదనని వ్యవధి అడిగి విచారముతో ఇంటికి వెళ్ళిపోయెను. ఆరోజుననే ఆయన వద్దకు ఒకసన్యాసి భిక్షుకు వచ్చెను. భిక్షాసమయమున ఆయన విచారముతో నుండుట కనిపెట్టి సన్యాసి ప్రశ్నించెను. “నీకు ఏమిదుఃఖము. విచారముగా ఎందుకు ఉన్నావు?” ఆ పౌరాణికుడు రాజు అడిగిన ప్రశ్నను చెప్పెను. స్వామివారు అతనికి ఇట్లు చెప్పిరి :—

నేను ఆప్రశ్నకు సమాధానము చెప్పెదను. కాని రాజునకుమాత్రము ఒకసన్యాసి చెప్పుననియే చెప్పవలెను. అంతట పౌరాణికుడు రాజు చెంతకు వెళ్ళి తమప్రశ్నకు మాయింటికి వచ్చిన సన్యాసి సమాధానము చెప్పునని పలికెను. రాజు అంగీకరించెను. సన్యాసి రాజునింటికి వచ్చి రాజును, పౌరాణికునిన్ని ఒకరికెదురుగా నింకొకరిని నిలుచుండబెట్టి త్రాళ్ళతో కట్టివేసెను. అనంతరము రాజును విడిపించమని పౌరాణికునకు ఆజ్ఞాపించెను. కాని పౌరాణికుని కాళ్ళును, చేతులునుకూడ కట్టబడియుండుటచే రాజును విడిపించలేకపోయెను. అప్పుడు సన్యాసి రాజుతో చెప్పెను. ఈపౌరాణికుడు అవిద్యచే కట్టబడియున్నాడు. తమరుకూడ బంధించబడియే యున్నారు. మరి బంధములయందు ఉన్నవానిని బంధములయందు ఉన్నవాడు ఎట్లు విడిపించగలడు?

ఈసందర్భమున అఖా చెప్పినది వినుడు :_

కథా కరీ తే శుకజీయే కరీ, పరీక్షితనే మేళవ్యా హరి,
శిఖ థయి త్యారే ఆప్యుం శుం నగ్న థయి గయా వనమాం పశు।
నిఃస్పృహీన ఏవీ ఛే కథా, బీజీ అఖా పేటు భరవానీ వ్యథా॥

శాస్త్రాభ్యాసము ప్రతిష్ఠకొరకును, జీవిత నిర్వాహణమునకును ఉపయోగించుచున్నది.

కథాప్రవచనము చేయవలెననిన శుకుడుమాత్రమే యోగ్యుడు. పరీక్షిత్తునకు ఏడురోజులలో ఈశ్వరసాక్షాత్కారము చేయించెను. కథ పూర్తిఅయినతరువాత దక్షిణాదులు తీసికొనుసంగతి అటుండనిండు. తాను బట్టలు కట్టుకొనెడివాడేకాడు. ఇతరులు తనశరీరముపై కప్పినవస్త్రములనుకూడ విసరివేసి పశువువలె నగ్నుడయి అడవిలోనికి వెళ్ళిపోయెడివాడు.

అట్టిమహాత్ములు ఇంటింటికి వెళ్లి ఉపదేశించరు. నాల్గువనముల యందు [illegible] దాగియుండెదరు। అనాయాసముగా [illegible]

కిన దానితో సంతోషించెదరు. దానిపై వారు రోజు గడుపుకొనె దరు. ఎవరైన వచ్చినచో రాముడు కృష్ణుడు మొదలగు రాజులసంగతి చెప్పి వినిపించెదరు. దత్తాత్రేయుడు, జడభరతుడు మొదలగు అవ ధూతలను గురించియు వివరించి పృచ్ఛకులను తమతో సమానముగా చేసెదరు. నేడు శాస్త్రాభ్యాసము ప్రతిష్ఠకొరకును, జీవితనిర్వహణము నకును ఉపయోగించుచున్నది.

పూర్వము వేదశాస్త్రములు జ్ఞానముకొరకుమాత్రమే అధ్య యనము చేయబడెడివి. పురాణాదులు చెప్పుటకు వినియోగించబడెడివి కావు. కాని ఇప్పుడు శాస్త్రాధ్యయనము గౌరవప్రతిష్ఠలు పొందుట కును, ద్రవ్యాదులు సంపాదించుకొనుటకును మాత్రమే ఉపయోగ పడుచున్నది. ఇట్లు శాస్త్రాధ్యయనము రోజులు గడపుకొనుటకు సాధనమయినది.

స్వా. ప్ర. :-యోగవాశిష్ఠమున చెప్పబడినది :-

వ్యాచష్టే యః పఠతి చ శాస్త్రం భోగాయ శిల్పవత్ ।
యతతే న త్వనుష్ఠానం జ్ఞానబన్ధుః స ఉచ్యతే॥

"శాస్త్రాభ్యాసము, ఉపన్యాసాదులు శిల్పమువలె భోగము కొరకు చేయువాడు అనుష్ఠానాదులకొరకు- అనగా యోగాభ్యాసము మొదలగువానికొరకు ప్రయత్నించడు. అతడు జ్ఞానబంధువు. అనగా శాస్త్రజ్ఞులలో అధముడు అని చెప్పబడును."

పూర్వము జ్యోతిశ్శాస్త్రము, వైద్యము, వేదాదులు మొద లగునవి పరోపకారముకొరకే అభ్యసింపబడెడివని పై ప్రమాణము లనుబట్టి తెలియుచున్నది. శిల్పాదులుమాత్రము జీవితనిర్వహణము నకు అభ్యసించబడెడివి. మణిధరమగు సర్పము అరణ్యమున తనశిరము నందున్న మణిప్రకాశము సహాయమున కప్పలు మొదలగుప్రాణులను వేటాడి భక్షించునట్లుగనే నేటి విద్వాంసులు తమకు లభించిన శాస్త్ర

జ్ఞానముద్వారా ఉపన్యాసాదులు, పురాణకాలక్షేపములు మొదలగు నవి కావించి భోగానుభవమునకు ఆవశ్యకములగు ద్రవ్యాదులును సంపాదించుచున్నారు. ఇట్టి విద్వాంసులు జ్ఞానబంధువులు.

## నేటి శాస్త్రాభ్యాసమునకు కారణము.

ఒక తపశ్శాలియగు మహాత్ముడు హృషీకేశము తరచువచ్చెడి వాడు. సన్యాసులు వారిని "తపోధనా" అని సంబోధించెడివారు. వారు ఎంత విద్వాంసులో అంత త్యాగి. ఒకానొకసమయమున ఒక మహావిద్వాంసుడు ఆయన చెంతకు వచ్చెను. ఆవిద్వాంసుడు ఆ తప శ్శాలిని అడిగెను. "నాకు శాంతి ఏల కలుగుటలేదు?"

తపశ్శాలి:—"మీరు శాంతికొరకు అధ్యయనము చేయలేదు. పూజా, ప్రతిష్ఠలు, ద్రవ్యము సంపాదించుటకు చదువుకొంటిరి. 5, 6 లక్షలరూపాయిలు మీకు లభించినవి. శాంతి కావలసినచో శాంతి కొరకు మొదటినుండియు అభ్యాసము ప్రారంభించుడు."

స్వా. ని. :—శ్రీశంకరులు చెప్పిరి.

*వాగ్వైఖరీ శబ్దఝరీ శాస్త్రవ్యాఖ్యాన కౌశలమ్,*
*వైదుష్యం విదుషాం తద్వద్ భుక్తయే న తు ముక్తయే॥*

"మాటలలో నేర్పరితనము, శబ్దప్రవాహము, శాస్త్రములను గురించి ఉపన్యసించుటలో చాతుర్యము, విద్వాంసుల వైదుష్యము ఇవి అన్నియును భోగముకొరకు మాత్రమే, ముక్తికొరకు కాదు."

## శాస్త్రపారంగతుడు పండితుడు కాడు.
## క్రియాశీలుడే సరియగు పండితుడు.

స్వా. ప్ర. :—చాలకాలము క్రిందట ఒకచోట చదివితిని.

*శాస్త్రాణ్యధీత్యాపి భవన్తి మూర్ఖా యస్తు క్రియావాన్ పురుషః స ఏవ,*
*సుచిన్తితం చౌషధమాతురాణాం న నామమాత్రేణ కరోత్యరోగమ్॥*

"శాస్త్రములను అధ్యయనముచేసినను మూర్ఖుడు కావచ్చును. క్రియాశీలుడే మానవుడు. వైద్యశాస్త్రమును మననముచేసి,సరియగు ఔషధమును జ్ఞాపకముచేసికొని దానిపేరును ఉచ్చరించినంతమాత్రమున రోగము తగ్గదు కదా !"

ఎవ్వడైన గీతాధ్యయనము చేసినతరువాతకూడ రాగద్వేషాది అసుర, రాక్షస స్వభావములను విడనాడక, దైవసంపదను పొందక ఆత్మసాక్షాత్కారమును కావించుకొనలేనిచో ఆతడు శాస్త్రములను చదివిన మూర్ఖుడు.

రామదాసస్వామివారుకూడ తన "అభంగు"నందు చెప్పిరి.

1. ఉత్తమగ్రంథములను నిత్యము శ్రవణముచేసినను, అవగుణములను విడనాడక, తన హితమును తాను తెలిసికొనలేనివాడు చదువుకొనిన మూర్ఖుడు.

2. భక్తికి వలయు సాధనములేకుండ, వైరాగ్యము, భజన చేయవలెనను భావమును లేకుండ ఆచరణరహితుడై, బ్రహ్మజ్ఞానమునకు సంబంధించిన మాటలనుమాత్రము చెప్పువాడు చదువుకొనిన మూర్ఖుడు.

3. బహుశ్రుతుడును, బుద్ధిమంతుడును అయి బ్రహ్మజ్ఞానమునకు సంబంధించిన కబుర్లు చెప్పుచు దురాశ, గర్వము మనస్సునందు కలిగియుండువాడు చదువుకొనిన మూర్ఖుడు.

4. జ్ఞానమునకు సంబంధించిన కబుర్లుచెప్పి తన స్వార్థమును పూరించుకొనువాడును, పిసినిగొట్టుతనముతో ధనమును కూడబెట్టువాడును, ధనసంపాదనమునకు పరమార్థమును సాధనముగా ఉపయోగించుకొనువాడును చదువుకొనిన మూర్ఖుడు.

5. జ్ఞానగర్వముతో మొండిపట్టుదల కలిగియుండువాడును తనకు కలిగిన క్రోధమును ఆపుకొనలేనివాడును, మాటలకును, చేతలకును భేదము కనబరచువాడును చదువుకొనిన మూర్ఖుడు.

6. అధికారము లేనిదే ఉపన్యసించుటకు వ్యర్థప్రయత్నము చేయువాడును, పరుషవాక్యములను పలుకువాడును చదువుకొనిన మూర్ఖుడు.

7. ఇతరుల దోషములను వర్ణించదలచువాడును, దేహాభిమానము కలవాడును చదువుకొనిన మూర్ఖుడు.

8. ఇతరులయందు తాను చూపుదోషములు తనయందు ఉన్నను వానిని కాననివాడు చదువుకొనిన మూర్ఖుడు.

9. పరమాత్మని విడచి మనుష్యుని స్తుతించువాడును, ఎవడు కనపడిన వానిని స్తుతించువాడును చదువుకొనిన మూర్ఖుడు.

10. తాను వైభవమున నిమగ్నుడయి జీవాత్మ తుచ్ఛమని పాఖండమతమును ప్రతిపాదించువాడు చదువుకొనిన మూర్ఖుడు.

11. పైపైన ఎంతయో గొప్పవాడుగా వేషము ధరించి ఆచరణమునందు ఏమియు కనబరచనివాడు—సన్మార్గమును విడనాడి ఆడంబరమును మాత్రము అభిమానించువాడు చదువుకొనిన మూర్ఖుడు.

12. అధ్యాత్మనిరూపణసమయమున ఉత్తమశ్రోతలు వచ్చినను, వారిని విడనాడి క్షుద్రులగు శ్రోతల మనస్సును రంజింపజేయువాడు చదువుకొనిన మూర్ఖుడు.

13. తనశిష్యుడు అనధికారిఅయి తనను అగౌరవించినను అతనియందే ఇంకను ఆశ కలిగియుండువాడు చదువుకొనినమూర్ఖుడు.

14. తాను వైభవములకు లోనయి సద్గురుని ఉపేక్షించువాడును, తన గురుపరంపరను దాచువాడును చదువుకొనిన మూర్ఖుడు.

"అవగుణములను తెలిసికొని వానిని త్యజించుటకు ఇచ్చట చదువుకొనిన మూర్ఖుల లక్షణములు చెప్పబడినవి. ఇందలి తప్పులు జ్ఞానులు క్షమింతురుగాక" అని రామదాసస్వామివారు క్షమార్పణ కోరుకొనిరి.

ఇతరశాస్త్రములుకూడ ఘోషించుచున్నవి.

*పఠకాః పాఠకాశ్చైవ యే చాన్యే శాస్త్రపాఠకాః,*
*సర్వే వ్యసనినో మూర్ఖాః క్రియావానేష పణ్డితః॥*

"చదివినవాడును, చదివించినవాడును, శాస్త్రపారంగతులగు విద్వాంసులును కూడ విద్యావ్యసనపరులగు మూర్ఖులే. ఏలనన, వారు శాస్త్రములను చదివినను వానిని అనుసరించి సంచరించుటలేదు. శాస్త్రములను అధ్యయనముచేసి అందు చెప్పబడినప్రకారము ఆచరించువాడే పండితుడు.

మహాపురుషులు చెప్పిన ఈవిధములగు ఉపదేశములను చదివినతరువాత నామనస్సు శాస్త్రములకు దూరమయ్యెను.

స్వా. ని. :– నిజమే. శాస్త్రములను చదివి, ఆవిధముగ ఆచరించనిచో ఆ చదువు అంతయు వ్యర్థము. శ్రుతికూడ చెప్పుచునే ఉన్నది :–

*ప్రాణో హ్యేష యః సర్వభూతైర్విభాతి విజానన్ విద్వాన్*
*భవతే నాతివాదీ ।*
*ఆత్మక్రీడ ఆత్మరతిః క్రియావానేష బ్రహ్మవిదాం వరిష్ఠః॥*

"పరమాత్ముడు ప్రాణస్వరూపుడు– ప్రాణములకు ప్రాణములవంటివాడు. అతడు సర్వభూతములద్వారా నానావిధములుగను ప్రకాశించును. ఆ పరమాత్ముని (పరోక్షముగా) తెలిసికొనినవాడు అతివాది కాడు. ఆతని వాగాది ఇంద్రియములు అన్నియు సంయమమునకు అలవాటుపడును. ఆతడు తన స్వరూపమునందే క్రీడించును. స్వరూపమునందే ఆనందించును. స్వరూపమునందే ధ్యానాదిక్రియలను ఆచరించును. ఆతడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు."

ఆత్మక్రీడః :— ధ్యాత, ధ్యానము, ధ్యేయము– అను త్రిపుటిలో సవికల్పసమాధి అను క్రియను ఆచరించుట ఆత్మక్రీడ.

ఆత్మరతిః :—ధ్యాత, ధ్యానము, ధ్యేయము- అను త్రిపుటి లేని నిర్వికల్పసమాధియందు ఆత్మానందమును అనుభవించుట ఆత్మరతి.

క్రియావాన్ :—సామాన్యార్థము క్రియాశీలుడు. అనగా యోగాభ్యాసము చేయువాడు అని చెప్పవచ్చును. జ్ఞాని శ్రౌత, స్మార్త కర్మలను ఆచరించవలసిన అవసరము లేదు. జ్ఞాని ఆత్మక్రీడుడు. ఆత్మరతుడు. ఆకారణముచే ఆతనికి కర్మలయందు ప్రవృత్తి లేదు. కావున క్రియాపదమునకు ధ్యానాదులు అని అర్థము.

ఈవిధముగ శ్రుతులను, స్మృతులను అభ్యసించి పరోక్ష జ్ఞానము కలిగినతరువాతను అపరోక్షజ్ఞానముకొరకు ధ్యానాదిక్రియలను ఆచరించువాడు పరిణామమునందు బ్రహ్మజ్ఞానమును అనుభవించును. అతడు శ్రేష్ఠుడు. కాని ఈరోజులలో శ్రుతిస్మృతులను అభ్యసించినతరువాత జనులు ఆప్రకారము బ్రహ్మమును పొందుటకు ప్రయత్నించుట లేదు. ఆజ్ఞానము వాగ్విలాసాదులకు ఉపయోగించుచున్నారు. అది నిరర్థకము.

## స్వరూప జ్ఞానమును ఫలము కలిగించని
## శాస్త్రాధ్యయనము నిష్ఫలము..

*ఋచో అక్షరే పరమే వ్యోమన్యస్మిన్దేవా అధి విశ్వే నిషేదుః।*
*యస్తన్న వేద కిమృచా కరిష్యతి య ఇత్తద్విదుస్త ఇమే సమాసతే॥*

(శ్వేతాశ్వతరోపనిషత్తు)

"వేదములయందలి మంత్రములచే వాచ్యమగు అక్షరబ్రహ్మము సర్వవ్యాపి. దేవతలును, జ్ఞానులును, ఎల్లరును రాత్రింబగళ్ళు దానియందే యుండి దానిని మననము చేయుచున్నారు. ఆబ్రహ్మమును తెలిసికొననివాడు కేవలవేదాధ్యయనముచే ఏమిచేయుచున్నాడు? అనగా నిరర్థకము. ఏలనన, పైన వివరించబడిన బ్రహ్మమును తెలిసి

కొనిన జ్ఞానులు మంత్రముల వాస్తవమగు అర్థమును గ్రహించి బ్రహ్మ మును పొందుచున్నారు."

అందుచే గీత, ఉపనిషత్తులు మొదలగు గ్రంథములను అభ్య సించిన తరువాత ఏకాంతమున కూర్చుండి వాని నిదిధ్యాసమునందు నిమగ్నుడగుట సాధకుని ప్రథమకర్తవ్యము.

త్రిభువన :— కొందరు భక్తులు భక్తిమార్గమున శాస్త్రాధ్యయ నమునకు స్థానము లేదనియు, ఒకగంట శాస్త్రముకొరకు వెచ్చించుట కంటె భజనయందు గడపుట ఉత్తమమనియు చెప్పుదురు.

స్వా. ప్ర. :— నవవిధ భక్తులలోను మొదటిభక్తి శ్రవణభక్తి. శాస్త్రశ్రవణము చేయనిదే "భక్తి అనగా నేమి? అది పొందుటకు సాధనమేమి? దానికి అధికారి ఎవడు? దాని ఫలమేమి?" అనునవి తెలిసికొనలేగు. శ్రవణభక్తినిగురించి దేవీభాగవతము ఇట్లు చెప్పు చున్నది.

న తేషాం సదసద్ జ్ఞానం వివేకో న చ మోక్షదః।
పశుభిశ్చ సమా జ్ఞేయా యేషాం న శ్రవణాదరః॥

"శ్రవణమును ఆదరించనివారికిని, సదసద్వివేకము లేనివారికిని, మోక్షమును కలుగజేయు వివేకముకూడ కలుగదు. అట్టివారు పశుతుల్యులు."

శాస్త్రశ్రవణము చేయనిదే ఏది ధర్మమో ఏది అధర్మమో జనులకు తెలియదు. కావున వారికి తప్పుడుమార్గమున పట్టించువారు దొరకినచో పశువులవలె తప్పుడుమార్గమున పోవుదురు. గొర్రెలను మేపువాడు గొర్రెలను, మేకలను మెడలో తాడువేసి తన గొట్టెల శాలవద్దకు తీసికొనిపోయి తన ఇష్టమువచ్చిన గుర్తులను వాటికి పెట్టు నట్లు శాస్త్రజ్ఞానము లేనందున ధర్మాధర్మవిచక్షణ కలుగని వారిని

ధూర్తులు, కపటులు అగు జనులు తమ చేతులలో చిక్కించుకొనె దరు. అసుర ప్రకృతికలవారు కొందరు బ్రహ్మచారిరూపముననో, గృహస్థాశ్రమమునందే ఆచార్యులుగను, గురువులుగను నటించియో, వానప్రస్థమునందును, సన్యాసమునందును వేరువేరు వేషమును ధరించియో చదువుకొననివారిని వలలో వేసికొనెదరు. ప్రత్యక్షప్రమాణ వాదులగు అసురులు- అనగా నాస్తికులు సాధుత్వము అను శస్త్రమును ప్రయోగించెదరు. కావున వారు దైవసంపదకలవారా? అసురసంపదకలవారా? అను విషయము శాస్త్రజ్ఞానము లేనిదే తెలియదు.

శాస్త్రశ్రవణముతోపాటు సత్ శాస్త్రవిచారము, సత్సంగము కూడ ఆవశ్యకము.

సత్సంగస్య వివేకస్య నిర్మలం లోచనద్వయమ్ ।
యస్య నాస్తి నరః సోఽన్ధః కథం న స్యాదమార్గగః॥

"సత్సంగము, వివేకము అను నిర్మలోచనములు లేనివాడు అంధుడు. అతడు కుమార్గమును ఏల పొందడు?"

సత్సంగముచే ముందుముందు జీవన్ముక్తుడగును.

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః॥

"సత్సంగముచే నిస్సంగము- నిష్కామము కలుగును. నిస్సంగత్వముచే నిర్మోహత్వము కలుగును. నిర్మోహత్వముచే నిశ్చలతత్త్వము తెలియును. నిశ్చలతత్త్వానుభూతి కలిగినచో జీవన్ముక్తుడగును."

సత్పురుషసమాగమముచే శాస్త్రజన్యజ్ఞానముద్వారా ధనాది మాయికపదార్థములయందు నిస్సంగము కలుగును. మాయికపదార్థములయందలి నిష్కామభావముచే మోహరహితుడగును. "ఈ వస్తువు నాకు హితమును చేయును, ఇది అహితము చేయును" అను

...నివేకసామర్థ్యము లేకపోవుట మోహము. ఆ మోహము ...పోవుటయే నిర్మోహత్వము. పసిబిడ్డలకు తమ మలమూత్రములను స్పృశించుటయందు రమణీయబుద్ధి యుండును. అది మోహము. ...గైదు సంవత్సరములయందు ఆరమణీయబుద్ధి నశించుటచే వారు ...రముగ నుందురు. ఇదేవిధముగ నిస్సంగత్వముచే ఆసక్తిలేనందున ...దులగు మాయికపదార్థములయందు రమణీయబుద్ధి (సుఖబుద్ధి) ...చుటచే మోహము పోవును. ఇట్లు మాయికపదార్థములయందు ...మోహత్వము సిద్ధించుటచే నిశ్చలతత్త్వము అనగా బ్రహ్మోపలబ్ధి ...గును. బ్రహ్మోపలబ్ధిచే జీవన్ముక్తుడగును. అనగా ఈశరీరము ...నే మోక్షము పొందగలుగును. కావున మొదట శాస్త్రశ్రవణము ...వశ్యకము.

శాస్త్రశ్రవణము లేని భక్తి.

శాస్త్రములను తెలిసికొననిదే భక్తిని అనుసరించినను బ్రహ్మ ...నమునకు యోగ్యమగు మార్గమును తెలిసికొనలేదు.

స్వా. ని. :—శాస్త్రశ్రవణము చేయనిదే కర్మలను ఆచరిం ...టు కష్టము. శాస్త్రములు తెలిసికొనితీరవలెను. లేనిచో ధర్మమా ...ర్గము తెలియదు.

*శ్రుత్వా ధర్మం విజానాతి శ్రుత్వా త్యజతి దుర్మతిమ్।*
*శ్రుత్వా జ్ఞానమవాప్నోతి శ్రుత్వా మోక్షం చ విన్దతి॥*

"శాస్త్రశ్రవణముచే మనుష్యుడు ధర్మమును తెలిసికొనును. దుర్మతిని త్యజించును. జ్ఞానమును పొందును. మోక్షము లభించును."

ఒకదొంగకు నలుగురు కొడుకులు. ఆ దొంగ తన నలుగురు కొడుకులకును ఎక్కడనైన కథాకాలక్షేపము జరుగుచో అక్కడకు వెళ్ళరాదని బోధించెను. ఏలనన, ఆకథాదులు తన ప్రవర్తనను నమ ...పవు. తండ్రి చెప్పిన ప్రకారము కుమారులు నడచుకొనిరి. వారు

కాలాంతరమున ఒక కుమారుడు ఒకమార్గమున వెళ్ళుచుండెను. ఆమార్గము తప్ప ఆతడు వెళ్ళుటకు వేరు త్రోవ లేదు. కథ వినబడకుండుటకు ఆతడు తన రెండుచెవులను వ్రేళ్ళతో మూసికొని వేగముగా నడచిపోవుచుండెను. కాని ఆత్రోవలోనే అతనికి ముల్లు గ్రుచ్చుకొనెను. అందుచే ఒకచేతిని చెవినుండి తప్పించి ముల్లు తీయవలసివచ్చెను. ఆసమయమున ఆతనికి కథయందలి "దేవతలకు నీడయుండదు" అను వాక్యము వినబడెను. అది దొంగ విని వెళ్ళిపోయెను. ఒకనాడు ఆదొంగ రాజభవనమున పెద్ద దొంగతనము చేసెను. దొంగను పట్టుకొనినవానికి గొప్ప బహుమతి నిచ్చెదనని రాజు చాటించెను. అయినను దొంగ పట్టుబడలేదు. అంతట అచ్చట వేశ్యకు ఆపనిని అప్పగించెను. దొంగలుండు ప్రదేశములను తెలిసికొని రాత్రి వేశ్య దేవతావేషమును ధరించి బయలువెడలెను. తిరుగుచు తిరుగుచు దైవవశమున వెనుకటిదొంగయింటికి వచ్చి ఇట్లనెను:—"నేను దేవతను. మీ ఇంటిలోనివారు దొంగతనము చేయుదురనుసంగతి నే నెరుగుదును. అయినను మీరందరును నాబిడ్డలు. నాకు బలి ఇచ్చినచో నేను మిమ్ములను రక్షించెదను." దొంగ ఇంటలేడు. అందుచే ఆతనిభార్య, ఆ ఇంటివారు దొంగల విషయమును అంగీకరించి ఇట్లు పలికెను :— "మావారు ఇంటలేరు. ఇంటికి వచ్చినవెంటనే మీకు బలి యిచ్చెదము. కొంచెముసేపు ఆగుము" అని చెప్పి ఒక ఆసనముపై కూర్చుండబెట్టెను. ఇంతలో దొంగ ఇంటికి వచ్చెను. ఆతనిభార్య ద్వారముచెంతనే సంగతులన్నియు వివరించి చెప్పెను. అంతట నాతడు దేవతాదర్శనమునకు లోనికి వెళ్ళెను. కాని ఆకథను వినిన దొంగ ఈ కపటదేవతయొక్క నీడను చూచెను. ఆమె దేవత కాదని సందేహము కలిగి మిగిలిన సోదరులకుకూడ ఈసంగతి చెప్పెను. అనంతరము సోదరు లందరు బలినిచ్చెదమని వంతుపెట్టి

ఆమెను అరణ్యములోనికి తీసికొనిపోయిరి. అక్కడ కత్తి బయటకు తీసి "నీవు ఎవ్వతెవు? నిజము చెప్పుము. లేనిచో చంపి వేసెదము" అనిరి. ఆవేశ్య భయపడి మృత్యుభయముచే సత్యమును వెల్లడించెను. "రాజు దొంగను పట్టుకొనినవానికి ఒక వేయి బంగారు నాణెములను ఇచ్చెదనని ప్రకటించెను. అందుచే నేను మీావద్దకు వచ్చితిని."

ఇది విని మొదటిదొంగ ఇట్లనుకొనెను :—

"మరియొకడు ఎవడైన రాజుదగ్గరనుండి బహుమతి తీసికొనుటకు మనలను పట్టించవచ్చును. కావున నేనే బయటపడుట మంచిది." అని తలచి తాను దొంగిలించిన ధనమును తీసికొనివెళ్ళి రాజునకు సమర్పించి క్షమార్పణ వేడుకొనెను. రాజు ఆతని సత్యప్రవర్తనకు సంతసించి ఆతని నేరమును క్షమించి బహుమానమును ఇచ్చెను. అంతట "ఒకనూరు కథ వినినంతనే నేను రక్షించబడితిని కదా! నిత్యము కథ వినినచో జరుగనిది ఏమి ఉండును?" అని ఆదొంగ అనుకొనెను. ఆరోజునుండి అతడు నిత్యము కథాశ్రవణమును విడనాడలేదు.

## శాస్త్రశ్రవణము చేయించు వక్తపాత్రత.

శ్రవణము చేయించువాడు బ్రహ్మదర్శి అయి ఉండవలెను. అంతటివాడు కాలేకపోయినచో దైవసంపదకలిగినవాడైనను అయి ఉండవలెను. అసురసంపద కలవానిచెంతమాత్రము శ్రవణము చేయుటవలన ప్రయోజనము ఏమియు కలుగదు. పైగా హానియే కలుగును.

త్రిభువన :— గురువుద్వారా బ్రహ్మవిద్యను శ్రవణము చేయవలసి యుండినను ఆచరణహీనుడయి, అసురసంపదకలిగి, దురాచారుడైనను అట్టిగురువు నోటినుండి శాస్త్రవచనములను వినుటలో తప్పేమి ?

స్వా. ని. :— గంగాజలము పవిత్రమైనదే. అయినను అపవిత్రమగు పాత్రయందు ఉన్నచో గ్రహించరాదు. మహాభారతము చూడుడు :—

*కపాలే యద్వదాపః స్యుః శ్వదృతౌ చ యథా పయః।*
*ఆశ్రయస్థానదోషేణ వృత్తిహీనే తథా శ్రుతమ్॥*

"కపాలమునందలి నీరు అపవిత్రము. కుక్కచర్మముతో కుట్టబడిన సంచిలోని పాలు అపవిత్రము. ఈ రెండును స్థానదోషముచే అపవిత్రములు. అటులనే ఆచరణహీనుడగు గురువుద్వారా వినిన బ్రహ్మవిద్య కూడ దోషభూయిష్ఠము."

శ్రోత ఆచరణహీనుడగు గురువువద్ద బ్రహ్మవిద్యోపదేశమును పొందినను మనన నిదిధ్యాసనములద్వారా ఆత్మసాక్షాత్కారమును పొందజాలడు. పైగా విషయములయందు ఆసక్తి కలిగియుండును. అట్టి శ్రోత వక్తగా మారి జనులకు ఉపదేశించినచో అతనివద్ద బ్రహ్మవిద్య అత్యంతపవిత్రమైనదైనను శ్రవణముచేయరాదు.

ఇట్టి ఉపదేశకుల ఉపదేశములు ప్రమాణము కావు. "పుట్టినీముపదేశినీం ప్రమాణయతి నో ధర్మే." అని చెప్పబడినది. కులటయొక్క ఉపదేశములు ధర్మమునకు ప్రమాణములు కావు. గణిక వాక్ఛక్తిని సంపాదించి గ్రామగ్రామములకు తిరిగి స్త్రీలనందరను పోగుచేసి పాతివ్రత్యధర్మమునకు సంబంధించిన వాక్యములు శాస్త్రముల నుండి కంఠస్థముచేసి ఉపదేశించినచో, అవి శాస్త్రప్రమాణము లగుటచే గ్రాహ్యములే అయినను, కులటచెప్పిన ఉపదేశములు గ్రహించుట ధర్మము కాదు. నిషిద్ధాచరణముకల వనితముఖమునుండి వెలువడినట్టి శాస్త్రప్రమాణములుకూడ అపవిత్రములగును. హాస్యము పాలగును.

ఈవిషయమున తుకారాము వాక్యములు వినుడు :—

పాలతో నిండిన కుండలో ఒక మద్యబిందువు పడినను పాలన్నియును అపవిత్రమగును. త్రాగుటకు పనికిరావు. ఇటులనే అహంకారముతో భ్రష్టుడయిన దుష్టుని నోటనుండి పరమార్థతత్త్వము యొక్క ఉపదేశము వినరాదు. మానవుని రూపమునకు 32 లక్షణములు కలవు. అయినను ముక్కు ఒకటి లోపించినచో మిగిలిన లక్షణములన్నియు వ్యర్థము. అన్నములో పడిన ఈగ అన్నమును కడుపులో జీర్ణము కానివ్వదు. అటులనే దుష్టుని కంఠమునుండి ఉపదేశమును వినుటచే వినినవానికి కళ్యాణము ఏమియు కలుగదు.

## ధర్మమునందు ప్రవర్తింపజేయుటకు మార్గము.

త్రిభువన :—ధర్మమునందు ప్రవృత్తి ఎట్లు కలుగును?

స్వా. ని. :—మీరు స్వయముగా ధర్మశాస్త్రగ్రంథములను యథార్థముగా అభ్యసించుడు. శాస్త్రమును యథార్థముగా తెలిసికొనినవాడు తన నిశ్చయమున స్థిరముగా నుండును. సత్యము, అసత్యము రెంటిని సరిగ తెలిసికొనుటవలన ఆతడు తన నిశ్చయమునుండి కదలడు. ఇతరుల మాటలను నమ్మడు. రత్నపరీక్షకు అలవాటు పడినతరువాత రత్నముయొక్క విలువసంగతి తెలియును. ఇతరుల మాటలను నమ్మి మోసపోడు. అటులనే ధర్మశాస్త్రమును సక్రమముగా నభ్యసించినతరువాత సత్యమును ధర్మస్వరూపమును, మానవుడు తెలిసికొనును.

మొదట శ్రుతులను, స్మృతులను అధ్యయనము చేయవలెను. వానియందలి తత్త్వవిచారము స్వయముగా చేయవలెను. అందలి సందేహముల నివృత్తి కలుగనిచో మహాత్ములను అడిగి తెలిసికొని ఒక నిర్ణయమునకు రావలెను. ఆప్రకారము సంచరించవలెను. మనువు వాక్యములు వినుడు :—

## ధర్మలక్షణము.

*శ్రుతిః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియమాత్మనః।*
*ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్॥*

"శ్రుతి, స్మృతి, సత్పురుషుల ఆచరణము, ఆత్మసంతుష్టి- ఈనాల్గును ధర్మముయొక్క లక్షణమని పెద్దలు చెప్పుదురు."

శ్రుతి అనగా వేదములు. స్మృతులు అనేకములు కలవు. సదాచారము అనగా మహాత్ముల ఆచరణము. సత్పురుషులు ఆచరించినవిధముగా తానుకూడ ఆచరించవలెను. ఈవిషయమున తైత్తిరీయము చూడుడు.

*"అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్। యే తత్ర బ్రాహ్మణాః సమ్మర్శినః యుక్తాః ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాః స్యుః॥ యథా తే తత్ర వర్తేరన్ తథా తత్ర వర్తేథాః॥"*

"నీకు ఏకర్మనుగురించికాని, ఆచారమునుగురించికాని సందేహము కలిగినచో వివేకసంపన్నులును, పరిభుభక్తి పరాయణులును, కోమలహృదయులును, ధర్మశీలురును అగు బ్రాహ్మణులు ఏవిధముగా సంచరించెదరో ఆవిధముగా సంచరింపుము."

ధర్మలక్షణమునందలి నాలుగవది ఆత్మసంతృప్తి. శ్రుతి, స్మృతి, సదాచారము ఈమూడింటిని విచారించి, అటుపైన అంతరాత్మ ఎట్లు చేయవలెనని నిర్ణయించిన అట్లు చేయుము. అది ధర్మము. "అయ్యో! ఇది అధర్మము" అని నీమనస్సు సందేహించని ఆచరణమును ఆచరించుము. అనగా నీ అంతఃకరణమునకు సంతోషము కలిగించునది ధర్మము.

**భక్తుడు:—నన్ను మాయాబంధమునుండి విడిపించు మార్గమును తెలుపుడు.**

## మాయాబంధమునుండి విడిపించు ఉపాయము.

స్వా. ప్రి: :— భక్తియును, వైరాగ్యమును పొంది యోగమును అభ్యసించిన మాయాబంధమునుండి ముక్తి కలుగును.

*ఉత్తమం యోగమాస్థాయ జ్ఞానీ విగతకల్మషః ।*
*మాయాతత్కార్యపాశేభ్యో విముక్తః సుఖమశ్నుతే ॥* (రామగీత)

"ఉత్తమయోగమును పొంది పాపరహితుడయిన జ్ఞాని మాయనుండియు, మాయాకార్యములగు బంధములనుండియూ విముక్తిని పొందును; సుఖమును పొందును."

## యో గ భే ద ము లు.

*"యోగః చిత్తవృత్తినిరోధః"*

"చిత్తవృత్తులను నిరోధించుట యోగము." చిత్తవృత్తులు:- 1. ప్రమాణము 2. విపర్యయము 3. వికల్పము 4. నిద్ర 5. స్మృతి అని 5 విధములు.

యోగము 4 రకములు.

*మన్త్రో లయో హఠో రాజో యోగశ్చేతి చతుర్విధః ॥*

"మంత్రయోగము, లయయోగము, హఠయోగము, రాజయోగము అని యోగము నాల్గు విధములు."

మంత్రయోగము:— యోగానుష్ఠానముకూడ సాధకుల సామర్థ్యముపై నాధారపడియున్నది. చిత్తమును పవిత్రముచేయుట కొరకు అల్పబుద్ధికల జనుడు దీర్ఘకాలము నిరంతరము భక్తిపురస్సరముగ, నియమానుసారమున చేయు మంత్రజపము మంత్రయోగము మంత్రప్రతిపాద్యమగు దేవతను చింతనచేయుచు చేయు మంత్రజపము మంత్రయోగము. పతంజలి యోగసూత్రమున జపలక్షణమును వివరించెను.

"తజ్జపస్తదర్థభావనమ్"

"దానిని (ఓంకారమును) అర్థచింతనముతో బాటు జపించవలెను."

## లయయోగము.

"లయో విషయవిస్మృతిః"

"విషయములను విస్మరించుట లయయోగము."

లయయోగశ్చిత్తలయః కోటిశః పరికీర్తితః।
గచ్ఛన్ తిష్ఠన్ స్వపన్ భుఞ్జన్ ధ్యాయేన్నిష్కలమీశ్వరమ్॥

"చిత్తమును పరమాత్మునియందు లయముచేయుటకొరకు అనేకవిధములగు లయయోగము శాస్త్రములయందు చెప్పబడినది. నడచుచున్నను, ఆగియున్నను, నిద్రించుచున్నను, తినుచున్నను- ఎల్లవేళలయందును సర్వవ్యాపియగు ఈశ్వరుని చింతించవలెను."

## హఠయోగము.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులను ఎనిమిది అంగములు కలది హఠయోగము. ఈ అష్టాంగయోగమునే హఠయోగ మనియెదరు.

హకారః కీర్తితః సూర్యః ఠకారః చన్ద్ర ఉచ్యతే।
సూర్యాచన్ద్రమసోర్యోగాద్ హఠయోగో నిగద్యతే॥

"హ"కారమనగా సూర్యుడు. "ఠ"కారమనగా చంద్రుడు. ప్రాణాయామముద్వారా ప్రాణనిరోధము జరిగి ప్రాణముద్వారా రెండునాడులును ఏకమగుట హఠయోగము.

## రాజయోగము.

రాజన్తం దీప్యమానం తం పరమాత్మానమవ్యయమ్।
ప్రాపయేద్యస్తు యోగోఽయం రాజయోగః ప్రకీర్తితః॥

"ప్రకాశస్వరూపుడును, అవినాశస్వరూపుడును అగు పరమాత్మని పొందించునది అగుటచే నిర్వికల్పసమాధిని రాజయోగ మనెదరు. మహాత్ములు ఆరాజయోగమును ఉత్తమమైనదని చెప్పుదురు."

*యదా పఞ్చావతిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ।*
*బుద్ధిశ్చ న విచేష్టతి తామాహుః పరమాం గతిమ్॥*

"జ్ఞానేంద్రియములు అయిదును, మనస్సు, బుద్ధి చేష్టాహీనములగుటను జ్ఞానులు పరమగతి యని చెప్పుదురు."

*తాం యోగమితి మన్యన్తే స్థిరామిన్ద్రియధారణామ్।*
*అప్రమత్తస్తదా భవతి యోగో హి ప్రభవాప్యయౌ॥*

"యోగమును తెలిసిన విజ్ఞులు స్థిరమగు ఇంద్రియధారణ యోగమని చెప్పెదరు. ఆస్థితియందు మానవుడు పొరపాట్లు చేయడు. ఏలనన, ఉత్పత్తివినాశములు రెండును కలసి యోగమనబడును."

## ఎనిమిది రకములగు మాయాబంధములు.

మాయాకార్యములు 8 రకములగు బంధములు. పాపరహితమగు అంతఃకరణముకల జ్ఞాని వానినుండి విముక్తిని పొందును.

*ఘృణా లజ్జా భయం శోకో జుగుప్సా చేతి పఞ్చమీ।*
*కులం శీలం చ జాతిశ్చేత్యష్టౌ పాశాః ప్రకీర్తితాః॥*

"దయ, లజ్జ, భయము, శోకము, నింద, కులాభిమానము, శీలాభిమానము, జాత్యభిమానము—అనునవి ఎనిమిది బంధములు."

ఘృణా:— అనగా దయ. ఇతరులను దుఃఖములనుండి నివృత్తి నొందించుటకు చేయు ప్రయత్నము దయ. అది ధర్మముగా పరిగణించబడినది. ఏధర్మకార్యమునుగూడ నిష్కామభావముతో చేసిన అది బంధము కానేరదు. అయినను ఆశ్రమభేదముచే దయాభేదము కూడ కలదు. ఆశ్రమవిరుద్ధమగు దయను కలిగియుండుట బంధకారణము. భరతుడను ఋషి దయాశీలతచే లేడిని రక్షించెను, అనంత

కము అది అతనికి దుఃఖకారణ మయ్యెను. లేడిని రక్షించుట చాలును. అనంతరము దానిని విడచివేయవలసియుండెను. దానియందలి మోహముతో దానిని అంటిపెట్టుకొని యుండుటచే అతనికి ఉపాధిగా పరిణమించెను.

లజ్జ :—అనుచిత ప్రవర్తనపట్ల ప్రజలు ఏమనుకొనెదరో అను భావము కలుగును. లజ్జకూడా ధర్మము. గీతలో దైవగుణములలో దానికి స్థానము కలదు. కాని కొందరకు తల్లిదండ్రులకు నమస్కరించుట అనినను, దేవదర్శనము చేయుట అనినను సిగ్గు కలుగును. అది అధర్మము అగుటచే బంధము.

భయమ్ :—ధర్మమార్గమున సంచరించినచో నాకు ఎట్లు జరుగును? నేను ఏమి తినెదను? ఏమి త్రాగెదను? ఏకాంతమున కూర్చొనినచో నన్ను పాములు మొదలగునవి కరచునేమో? నేను చచ్చిపోవుదునేమో— ఇట్టి ఆలోచనలు కలుగుట భయస్వరూపము. అది ఈశ్వరప్రాప్తికి తీసికొనిపోవు మార్గమునుండి మానవుని విముఖుని చేయును. అది బంధము.

శోకః :—ఇష్టవస్తు వియోగముచేతను, అనిష్టవస్తుసంయోగముచేతను కలుగు తమోగుణపరిణామమగు ఖేదవిశేషము శోకము. జగత్తునందలి పదార్థములు అనిత్యములను బుద్ధి కలుగకుండుటచేతను, అవి తన భోగహేతువు లనుకొనుటచేతను, సంతోషము పొందకుండుట శోకమునకు కారణము. అస్వభావము వైరాగ్యాభావమును, ఈశ్వరునియందు శ్రద్ధలేకుండుటను సూచించును. కావున అది బంధము.

జుగుప్సా :—ఇతరులను తేలికగా చూచుటకు, ఇతరులను అవమానించవలెనను బుద్ధిచే వారి గుణములయందు దోషములను ఆరోపించుట. సామాన్యముగా మనుష్యుడు పుణ్యమును పొందుటకు

ప్రయత్నపూర్వకముగా పుణ్యమును ఆచరించును. కాని తిరస్కరించు వాడు, ఎవనిని తిరస్కరించునో అతని పాపములు తన తలపై వేసి కొనును. ఇట్లు జుగుప్స పాపమునకు ప్రత్యేకసాధనము. అందుచే అది బంధము.

కులమ్ :—ఉన్నతవంశమున పుట్టితిని అను అభిమానము మహాభారతయుద్ధసమయమున శ్రీకృష్ణుని తమవైపునకు త్రిప్పుకొనుటకు పాండవులును, కౌరవులును విజ్ఞప్తిచేసిరి. "రేపు ఉదయము నా వద్దకు మీ మీ ప్రతినిధులను పంపుడు. వారిలో ఎవరిని నేను ముందు చూచిన వారిపక్షమున ఉందును" అని కృష్ణుడు కబురుపంపెను. కౌరవపక్షమునుండి దుర్యోధనుడును, పాండవపక్షమునుండి అర్జునుడును ఆయనవద్దకు ప్రతినిధులుగా వెళ్ళిరి. భగవానుడు నిద్రించుచుండుట వారు గమనించిరి. ఆయన మేల్కొనువరకు వారు నిరీక్షించవలసివచ్చెను. దుర్యోధనుడు ఇట్లు తలచెను. "నేను రాజును. వంశపారంపర్యముగా వచ్చిన సింహాసనమును అధిష్ఠించియున్నాను. శ్రీకృష్ణుడు సామాన్యుడగు గొల్ల. యదుకుల క్షత్రియుడు. కావున అతని తలవద్దనున్న ఆసనముపై కూర్చొనెదను." అని తలచి ఆతడు అట్లు చేసెను. కాని అర్జునుడు భగవద్భక్తుడు. వినయముతో ప్రభు చరణములచెంత కూర్చొనెను. భగవానుడు లేచినంతనే చరణముల చెంత నాసీనుడయిన అర్జునుని మొదట చూచి అతనితోనే ఉండెదనని ప్రతిజ్ఞ చేసెను. పిదప దుర్యోధనుని చూచి ఇట్లనెను :— "నేను మాటకు కట్టుపడెదను. అర్జునుని మొదట చూచితిని. కావున నేను వారిపక్షమునందే ఉండెదను."

దుర్యోధనునికి కులాభిమానము బంధమయ్యెను. ఆ బంధము చేతనే చివరకు ఆతనికి భగవానుడు లభించలేదు. సర్వనాశనము అయ్యెను.

శీలమ్ :—బ్రాహ్మణభక్తి, దైవమునందు మాతాపితరుల యందు భక్తి, సౌమ్యత్వము, ఇతరులకు సంతాపము కలుగజేయకుండుట, అసూయ లేకుండుట, కోమలత్వము, కఠోరవచనములను పలుకకుండుట, ప్రాణులందరి హితమును చేయవలెనను స్వభావము, అందరితోను ప్రియమగు సంభాషణముచేయుట, ఇతరులు చేసిన ఉపకారమును మరువకపోవుట, శరణు జొచ్చినవారిని రక్షించవలెనను భావము, దయాశీలత, శాంతి- అని శీలములు 13 రకములు. ఈ శీలాభిమానము కలవాడు ఇతరులకంటె తాను గొప్పవాడ ననుకొనును. వారిని అవమానించును. ఆ అవమానముచేయుట పాపము. కావున అది బంధము.

జాతిః :—బ్రాహ్మణాదివర్ణములయందు జన్మించుట. ఈ జాత్యభిమానముకూడ పాపహేతువే. జాత్యభిమానము కలవానికి పుణ్యకార్యముల ఫలితము త్వరగా లభించదు. ఉత్తంకుడు అను ఋషి అమృతపానము చేయవలెనని కోరిక కలిగి విష్ణుభగవానునికొరకు చాల తపము చేసెను. భగవానుడు ప్రత్యక్షమయ్యెను. ఆయనకు ఉత్తంకుడు తనకోరికను వెల్లడించెను. "నీకు ఇంద్రుడు అమృతమును పానము చేయించుటకు వచ్చును." అని భగవానుడు పలికి అంతర్ధానమయ్యెను. విష్ణుభగవానుడు ఉత్తంకునకు అమృతపానము చేయించమని ఇంద్రుని ఆజ్ఞాపించెను. "బ్రాహ్మణునకు జాత్యభిమానము అధికము. నేను ఉత్తంకఋషికి అమృతము త్రాగించవలెనుకదా! ఏమి ఆపదవచ్చునో" అను భయము ఇంద్రునకు కలిగెను. ఇంద్రుడు అతనికి మోసము చేయనుద్దేశించి భిక్షుకుని రూపమున ఒక మురికికుండలో అమృతమును తీసికొని వచ్చెను. ఉత్తంకుడు ఇట్లనుకొనెను—"దేవతలు ప్రకాశించుచుందురు ఇంద్రుడు దేవతలకు రాజు. ఆతడు ఇట్లు మలినవేషముతో కూడిన భిక్షుకుని రూపముతో ఎట్లు వచ్చును? వీడు ఎవడో

నన్ను జాతిభ్రష్టునిగా చేయుటకు కుండలో నిషిద్ధపదార్థమును తీసికొనివచ్చెను.'' ఇంద్రుడు భిక్షుకుని వేషములో, "ఇదిగో అమృతము, తీసికొనుము'' అని చెప్పెను. అంతట ఉత్తంకుడు బిగ్గరగా నిట్లనెను:- "స్వామి, నేను అమృతము త్రాగను.'' ఇంద్రునకు కావలసినది ఇదియే. ఈమాటలు వినగనే ఇంద్రుడు అక్కడనుండి వెళ్ళిపోయెను. ఇట్లు జాత్యభిమానముచే ఉత్తంకుడు అమృతమును కోల్పోయెను. ఈ విషయమున మరియొక దృష్టాంతముకూడ కలదు.

కాశీపరిసరములలో ఒక సన్యాసి ఉండెను. తన ప్రబలమగు పురుషార్థముచే అతడు ఉన్నతస్థితికి వచ్చెను. కాని ప్రారబ్ధవశమున ఆవరణభంగముమాత్రము మిగిలియుండెను. ఆకారణముచే అతడు పూర్ణదశకు చేరలేదు. ఒకప్పుడు తన అవసానదశ సమీపించినదని తెలిసికొని ఆతడు తన శిష్యులతో నిట్లనెను:—

"నాశరీరము కాశీలో పడుట మంచిది.'' శిష్యులు ఆయన కోరికను అనుసరించి పాలకిలో కూర్చుండబెట్టి ఆయనను కాశీ తీసికొని వెళ్ళుచుండిరి. త్రోవలో దాహము వేయుటచే ఆతడు నీరు త్రాగదలచెను. అంతట శిష్యులు పాలకిని ఒక చెట్టుక్రింద దింపిరి. ఒక శిష్యుడు జలము తీసికొని వచ్చుటకు వెళ్లెను. నీటికొరకు చుట్టుప్రక్కల ఎంత వెదకినను దొరకలేదు. దగ్గరలో ఒక మాలపల్లి కన్పించెను. అదిచూచి శిష్యుడు ఆలోచించెను. "గురువుగారికి చాల దాహము వేయుచున్నది. ఎక్కడను నీరు దొరకుట లేదు. ఈ మాలపల్లినుండి నీరు ఎందుకు తీసికొనిరాకూడదు? ఆపత్కాలమున ఈ జలము త్రాగుటయందు దోషము లేదు.'' ఇట్లు తలచి శిష్యుడు అచ్చటినుండి జలము తీసికొనివెళ్ళి గురువుగారికి సమర్పించెను. నీరు త్రాగి కొంచెము శాంతించిన తదుపరి గురువుగారు శిష్యుని అడిగిరి:-

"నీరు ఎక్కడనుండి తెచ్చితివి?''

శిష్యుడు:— స్వామీ! నీటికొరకు చాలవెదకితిని. కాని ఎక్కడను దొరకలేదు. అందుచే సమీపమున ఉన్న మాలపల్లినుండి తెచ్చితిని.

ఇది విని గురువు చింతించుచు ఇట్లనెను:—

"అరరే! జీవితము అంతయు వ్యర్థమయ్యెను. నాశరీరము అపవిత్రమయ్యెను." ఇట్లు పలుకుచుండగనే ఆయన ప్రాణములు పోయెను.

పునర్జన్మమున అతడు కాశీలో దండోరావేయు మాలవాని ఇంట పుట్టెను. ఏలనన, అంత్యావస్థయందు అతనికి బ్రాహ్మణాభిమానము పోలేదు. కాని జ్ఞానమును పొందు ప్రయత్నములో అవసానదశను పొందుటచే వామదేవ, జడభరతులవలె జన్మకాలమునుండియు మూగవాడువలె కన్పడెను. అందరును అతడు పిచ్చివాడని కూడ అనుకొనుచుండిరి.

ఒకమారు అతని తండ్రి ఏదియో అవసరము కలిగి ప్రక్కనున్న గ్రామమునకు వెళ్ళెను. వెళ్ళుసమయమున ఆతడు తన మూగకుమారుని పిలచి సంజ్ఞచేసి దండోరా వేయుమని చెప్పి వెళ్ళిపోయెను. ఆమహాత్ముడు దండోరా వేయుటకు వెళ్ళుచు ఇట్లు తలచెను. అందరును రాత్రిపూట "దొంగలున్నారు, జాగ్రత్త, మేలుకొనుడు" అని దండోరా వేయుదురు. కాని ఈరాత్రి నేను అధికారులను అజ్ఞానమనెడు రాత్రియందు కామ, క్రోధాది చోరులనుండి జాగ్రత్తగానుండమని జ్ఞానప్రబోధకమగు దండోరా వేయుదును."

మొదటిజామున అతడు డప్పువాయించుచు ఇట్లు పలికెను:—

*"ఆశాయాం బధ్యతే లోకః కర్మణా పరిబధ్యతే ।*
*ఆయుఃక్షయం న జానాతి తస్మాజ్జాగృహి, జాగృహి ॥"*

"ప్రాణి ఆశచే బంధమునందు చిక్కువడును. కర్మచే మిక్కిలి చిక్కువడును. కాని ఆయువు నశించుచున్నది అనుసంగతి తెలిసికొనలేదు. కావున మేల్కొనుడు మేల్కొనుడు."

దండోరా వేయుచు రాజాంతఃపురముచెంతకు వచ్చి ఇట్లు పలికెను. రాజు మేల్కొని ఉండెను. ఆయన ఇదివిని ఇట్లు తలచెను. "ఇతడు మామూలుగా డప్పువేయువాడు కాడు. ఎవడో పూర్ణయోగి." ఈఆలోచనలో ఆతడు మేల్కొనియే యుండెను.

రెండవ జామునందు ఆతడు మరల దండోరాలో ఈశ్లోకము చదివెను:—

*"జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః।*
*అన్త కాలే మహాదుఃఖం తస్మాజ్జాగృహి జాగృహి॥"*

"పుట్టుట దుఃఖము. ముసలితనము దుఃఖము. భార్యాపుత్రాదులు బంధువులు దుఃఖము. మృత్యువు మహాదుఃఖము. కావున మేల్కొనుడు, మేల్కొనుడు." ఇదికూడ రాజు వినెను.

మూడవ జామునందు అటులనే మూడవశ్లోకముకూడ చదివెను:—

*"కామక్రోధౌ లోభమోహౌ దేహే తిష్ఠన్తి తస్కరాః।*
*జ్ఞానరత్నాపహారాయ తస్మాజ్జాగృహి జాగృహి॥"*

"కామము, క్రోధము, లోభము, మోహము అను నలుగురు దొంగలును జ్ఞానమను రత్నమును అపహరించుటకు శరీరమునందు సిద్ధముగా నున్నారు. కావున మేల్కొనుడు, మేల్కొనుడు."

దీనినికూడ రాజు వినెను.

నాలుగవ జామునకూడ ఆవిధముగనే నాలుగవ శ్లోకమును చదివెను.

*"ఐశ్వర్యం స్వప్నసంకాశం యౌవనం కుసుమోపమమ్।*
*క్షణికం చలమాయుష్యం తస్మాజ్జాగృహి జాగృహి॥"*

ఐశ్వర్యము స్వప్నమువంటిది. యౌవనము పుష్పమువంటిది. ఆయుర్దాయము క్షణికము, చంచలమైనది. కావున మేల్కొనుడు, మేల్కొనుడు. రాజు అధికారి కావున శ్లోకములను వినినవెంటనే ఈ మహాత్ముని దర్శించవలెనని నిశ్చయించెను. తరువాతిరోజున ఆయన డప్పువేయువారిలో యజమానిని పిలచి అడిగెను,

"నిన్న డప్పువేయుట ఎవనివంతు"

అతడు డప్పువేయవలసినవాని పేరు చెప్పెను.

"కాదు మరియొకడు. అతనిని తోడ్కొని రమ్ము" అని రాజు పలికెను.

యజమాని మామూలుగా వంతుకలవానిని తీసికొనివచ్చెను. అతడు కంగారుపడుచు ఇట్లు విన్నవించుకొనెను.

"అన్నదాతా! నిన్న నాఇంటిలో ఏదోపని యుండుటచే గ్రామాంతరము వెల్లితిని. మా మూగకుర్రవాడు డప్పు వేయుటకు వచ్చెను. వాడేమయిన తప్పుచేసినచో నాతప్పుగా భావించి క్షమించుము."

రాజు పలికెను:— నాకు నీ మూగకుమారునితో పని ఉన్నది.

ఇట్లు పలికి రాజు ఆమాలపేటలోనికి వెళ్ళి ఆ మూగకుమారునకి సాష్టాంగదండప్రణామ మాచరించి పలికెను:– "ప్రభూ, శరణు, ఉపదేశించుడు."

ఈదృష్టాంతమున సన్యాసియగు మహాత్ముడు జాత్యభిమానముచే మాలజన్మమును పొందెను. కావున జాత్యభిమానము బంధము.

## జ్ఞానముచే బంధమునుండి ముక్తి.

ఈ ఎనిమిది బంధములనుండియు జ్ఞానముచే ముక్తి కలుగును.

జ్ఞాత్వా దేవం సర్వపాశాపహానిః,
క్షీణైః క్లేశైః జన్మమృత్యుప్రహాణిః।

"అఖండసచ్చిదానంద ఆత్మస్వరూపమును తెలిసికొనినంతనే అన్నివిధములగు బంధములును సమసిపోవును. అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అను 5 క్లేశములును క్షీణించును. జన్మ, ఆయువు, భోగము, మృత్యువు- వీనిదుఃఖములనుండి నివృత్తి కలుగును."

## పంచక్లేశములు.

పంచక్లేశముల స్వరూపమును స్థూలముగా తెలిసికొనని దే అవినివృత్తిని పొందరు. పతంజలి వానిస్వరూపమును యోగశాస్త్రమున వివరించెను. అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము- అనునవి పంచక్లేశములు. అస్మితాదులగు నాలుగు క్లేశములును అవిద్యనుండియే ఉద్భవించును.

అవిద్య:- *అనిత్యాశుచిదుఃఖానాత్మసు నిత్యశుచిసుఖాత్మఖ్యాతిరవిద్యా ।*

అనగా అనిత్యమునందు నిత్యబుద్ధి, దుఃఖమునందు సుఖబుద్ధి, అపవిత్రమునందు పవిత్రబుద్ధి, అనాత్మపదార్థములందు (దేహము, ఇంద్రియములు, ప్రాణములు, మనస్సు, బుద్ధి- వీనియందు)- ఆత్మబుద్ధి. ఇదియే అవిద్య. దీనినే శాస్త్రజ్ఞులు తమస్సు, అజ్ఞానము, అసత్యము, మాయ మొదలగు శబ్దములతో వివరించిరి.

అస్మిత:— *దృగ్దర్శనశక్త్యోరేకాత్మతేవాస్మితా ।*

దృష్టి, దర్శనము- ఈ రెంటియొక్క- అభేదప్రత్యయము అస్మిత. అస్మితయందు వివేకము ఉండదు. అస్మితకు మారుపేరు మోహము.

రాగము:— *సుఖానుశయీ రాగః ।*

సుఖాది సాధనములలో ప్రవృత్తి కలిగించునది రాగము. సుఖాదిసాధనాభావమునందుకూడ సుఖప్రత్యయచింతనము రాగము. దీనినే మహామోహము అనికూడ అనెదరు.

ద్వేషము:— *దుఃఖానుశయీ ద్వేషః ।*

రాగవిషయీభూతపదార్థముల ప్రాప్త్యభావముచే ద్వేషము జనించును. దానినే తామిస్రము అనికూడ అనెదరు.

అభినివేశము:- స్వరసవాహీ విదుషోఽపి తథారూఢోఽభినివేశః ॥

ఆయుర్దాయాదులు లేకపోయినను తనశరీరమునందలి అపరిమితమగు ప్రేమచే శరీరము మరణము పొందరాదని కోరుట అభినివేశము. దీనిని అంధతామిస్రము అనికూడ అనెదరు.

అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము- అను ఈ ఐదింటికిని తమము, మోహము, మహామోహము, తామిస్రము, అంధతామిస్రము- అను మారుపేర్లుకూడ కలవు. ఇట్లు అవిద్య పంచభేదాత్మకము. పైనచెప్పిన క్లేశములు ప్రసుప్త, తను, విచ్ఛిన్న, ఉదార భేదములచే తిరిగి నాలుగు రకములు.

1. పూర్వానుభూతమగు భోగ్యపదార్థానుభవజన్యసంస్కారము అంతఃకరణమునందు ఉండుట 'ప్రసుప్తా'వస్థ.

2. ఆ ప్రసుప్తపదార్థానుభవసంస్కారము స్మర్యమాణమయి 'తను' అవస్థను పొందును. 3. ఆ స్మర్యమాణపదార్థము లభించిన కొలది రాగము 'విచ్ఛిన్నా'వస్థను పొందును.

4. పూర్వానుభూతమగు భోగ్యపదార్థము మరల లభించినప్పుడు కన్పట్టు అనంతమగు ప్రేమ 'ఉదారా'వస్థ.

ఇట్లు ప్రతిక్లేశమును నాల్గురకములు. క్లేశజన్యమగు కర్మవిపాకముయొక్క పరిణామములు నాలుగు- జన్మము, ఆయువు, భోగము, మృత్యువు.

ఆత్మసాక్షాత్కార మయినంతనే ఈ నాలుగు కర్మవిపాకములును నివృత్తిని పొందును. యోగులు తమ సిద్ధాంతమునందు అవిద్యాది పంచక్లేశనివృత్తికి సంప్రజ్ఞాత, అసంప్రజ్ఞాత యోగములు సాధనములని చెప్పెదరు. కాని ఉపనిషత్సిద్ధాంతమునందు అనురాగము కల

సజ్జనుల అభిప్రాయము ననుసరించి అస్మితాదిక్లేశములు అవిద్యాజన్యము లగుటచే, అవిద్యానాశముతో బాటు అవి నశించిపోవును. "తత్త్వమస్యాది" మహావాక్యములచే ఉత్పన్నమగు జ్ఞానముద్వారా ఆత్మసాక్షాత్కారము కలిగి అవిద్య నశించును. ఉభయపక్షముల యందును దుఃఖకారణము అవిద్యయె. దాని నివృత్తియే ఆత్మసాక్షాత్కారమునకు హేతువు. అదియే పరమపురుషార్థము.

త్రిభువన:—ఆ ఆత్మసాక్షాత్కారమునకు పురుషార్థము చేయుట ఎట్లు?

స్వా. ప్ర. :—శ్రవణ, మనన, నిదిధ్యాసనములు చేయుడు.

త్రిభువన:—శ్రవణము కొంతవరకు చేయుచునే యున్నాను. ఇంకను వినవలెనను కోరిక లేదు. మననము, నిదిధ్యాసనము చేయవలెనను కోరిక కలదు.

స్వా. ప్ర. :—

*నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన,*
*యమేవైష వృణుతే తేన లభ్య స్తస్యైష ఆత్మా వివృణుతే తనూగ్ం స్వామ్॥*

"ఈ ఆత్మ ప్రవచనములద్వారాను, ఉపన్యాసాదులను వినుటద్వారాను, గ్రంథముల అర్థములను జ్ఞాపకము ఉంచుకొనుటద్వారాను, అధికముగా శ్రవణము చేయుటవలనను లభ్యము కాదు. తనస్వరూపమును తెలిసికొనగోరు జిజ్ఞాసువులకు మాత్రమే ఇది తెలియును. వారికి ఈ ఆత్మ తనస్వరూపమును తెలియజేయును. ఈ ఆత్మ ఎందుకును పనికిరాని దుర్బలునకుకూడ లభించదనికూడ శ్రుతి చెప్పుచునే యున్నది.

*నాయమాత్మా బలహీనేన లభ్యో న చ ప్రమాదాత్తపసో వాప్యలిఙ్గాత్,*
*ఏతై రుపాయైర్యతతే యస్తు విద్వాంస్తస్యైష ఆత్మా విశతే బ్రహ్మధామ॥*

"కామాదిశత్రువుల ఎదుట ఓడిపోవని మనోబలము లేని వానికి ఈ ఆత్మ లభించదు. అంతస్త్యాగముతోను, బహిస్త్యాగము తోను కూడిన తపస్సు లేనివానికికూడ ఆత్మ లభించదు. పైనచెప్పిన మూడు ఉపాయములద్వారా ప్రయత్నించిన జిజ్ఞాసువుయొక్క జీవాత్మ అంతమున బ్రహ్మతత్త్వముతో అభేదమును పొందును."

బ్రహ్మవిద్య అతికఠినమైనది. శాస్త్రములు వానిని కత్తిపదును పై నడచుటతో పోల్చినవి.

త్రిభువన:—అయిన నేను అరణ్యములోనికి పోయి మౌనముగానుండి ఏకాంతమున అభ్యసించవలెనా?

స్వా. ప్ర. :—ఆ అవసరములేదు. మౌనము మూడు రకములు. 1. వాఙ్మౌనము, 2. అక్షమౌనము; 3. కాష్ఠమౌనము. వాఙ్మౌనమునందు వాక్కు నిరోధించబడును. అక్షమౌనమునందు ఇంద్రియనిరోధము జరుగును. కాష్ఠమౌనమునందు ఉడ్యానబంధము మొదలగు ఆసనములద్వారా శరీరమును కాష్ఠమువలె కదలకుండ నిలబెట్టవలెను.

వాఙ్మౌనమునుగురించి ఈశ్లోకమునందు చెప్పబడినది.

సమ్యక్ఛబ్ద ప్రపఠనాత్ శుకో బద్ధోఽస్తి పఞ్జరే,
స ఏవ ముక్తో మౌనేన, మౌనం సర్వార్థసాధకమ్॥

"బాగుగా కబుర్లు చెప్పు చిలుకను పంజరములో బంధించెదరు. మౌనముగా నున్నచో అది ముక్తిని పొందును. మౌనము అన్ని ప్రయోజనములను సిద్ధింపజేయును."

ఒక చిలుకల వర్తకునివద్ద ఒక చిలుకపిల్ల ఉండెను. అతడు దానిని చాలప్రేమతో పెంచెను. ఆ చిలుకపిల్ల మనుష్యులవలె మధురభాషణములను మాట్లాడుట నేర్చుకొనెను. కొన్నివాక్యములతో బాటు శ్లోకములనుకూడ వర్తకుడు దానికి నేర్పెను. అంతట ఒక

రోజున దానిని అమ్ముటకు ఆతడు బజారునకు తీసికొనివెళ్లెను. దాని చతురవచోనైపుణ్యమునకు సంతసించి ఒక శ్రీమంతుడు వేయిరూపాయిలకు దానిని కొనెను. శ్రీమంతుడును, ఆతనికుటుంబమువారును ఆచిలుకను ఎంతయో ప్రేమతో పెంచుచుండిరి. దానిని ఒక బంగారు పంజరమున ఉంచి ప్రతిదినము దానిమ్మగింజలు, పండ్లు మొదలగునవి తినుటకు పెట్టుచుండిరి. ఎవరైన వచ్చిన తీయని పలుకులు పలుకుచు, సంస్కృతశ్లోకములను చదువుచు ఉండుటచే ఆచిలుకగౌరవము చాల పెరిగిపోయెను. ఒకరోజున ఆశ్రీమంతుని గృహమునకు ఒక సన్యాసి భిక్షార్థము ఏతెంచెను. చిలుక ఆయనకు నమస్కరించి పలికెను. "స్వామీ, నేను ఈపంజరములో చిక్కుపడియున్నాను. తమరు ప్రపంచమునకు నిష్కారణబంధువులు. నేను విముక్తినిపొందు మార్గము తెలుపుదురా?" అని అడిగెను. సన్యాసి పలికెను:— మా గురువుగారిని అడిగి రేపు తెలుపగలను. చిలుక "సరే" అనెను. సన్యాసి తన ఆశ్రమమునకు వెళ్లి గురువుగారికి చిలుకసంగతి తెలిపెను. ఈసంగతి విని గురువుగారు చిలుకముక్తికి ఉపాయము చెప్పుటకుబదులు మాట్లాడకుండ ఉండిపోయిరి. ఒకనిముషములో ప్రాణము పోయినట్లు భూమిమీద పడిపోయిరి. రెండవరోజు సన్యాసి శ్రీమంతుని ఇంటికి భిక్షకు వెళ్ళి చిలుకతో నిట్లనెను:—

"ఓశుకమా! నీముక్తి సంగతి అటుంచుము. నీసంగతి చెప్పినంతనే గురుశ్రీవారు మారుమాట పలుకలేదు. భూమిమీద పడిపోయిరి. ఆయన ఏ ఉపాయమును సూచించలేదు."

చిలుక చెప్పెను:— "స్వామీ, తమరు అర్థము చేసుకొనలేకపోయిరి. అది నాకు చెప్పిన సమాధానమే. తమరు ఊహాపరులైన సాధువులుగా కన్పట్టుటలేదు. దయచేయుండి." తరువాతిరోజు ఉదయము చిలుకకు ఆహారము ఒసగుటకు శ్రీమంతుని సేవకులు వచ్చి

నప్పుడు చిలుక గురువుగారు చేసినవిధముగ ఆచరించెను. మృదు మధురవాక్కులతో వారిని గౌరవించుటకుబదులు చిలుక మౌనము వహించెను. ప్రాణములు పోవుచున్నవేమో అను అనుమానము వారికి కలుగుటకు పంజరములో నిశ్చేష్టమై పడిపోయెను. సేవకులు చిలుకకు మృత్యువు సమీపించెనని అనుకొని దానిని పంజరము బయట పడవేసెను. వెంటనే చిలుక ఎగిరిపోయెను.

తాత్పర్యమేమన, మౌనము సామాన్యులకు తగినదే. కాని బుద్ధిమంతులకు తగదు. "గిరా మౌనం తు బాలానామ్" అని శంకరులు చెప్పిరి. వాఙ్మౌనము బాలురకు ఉచితము. బాలశబ్దమును మనువు స్పష్టముచేసెను. "అజ్ఞో భవతి వై బాలః" బాలుడనగా అజ్ఞాని. ఏల నన అజ్ఞానికి బుద్ధి తక్కువగ ఉండును. కావుననే "మౌనాత్సత్యం విశిష్యతే" అని మనువు చెప్పెను.

మౌనముకంటె సత్యము శ్రేష్ఠమైనది. చాలమంది మాట్లాడినచో అసత్యదోషము కలుగునని మౌనముగా నుందురు. అనగా వారి మౌనమునకు కారణము అసత్యదోషము రాకుండుటయే. వాఙ్మౌనమునకు వాస్తవస్వరూపము మితభాషిత్వము.

"మితపరిభాషణం మౌనమ్."

"మౌనాన్న మునిర్భవతి నారణ్యావసనాన్మునిః।
స్వలక్షణంతు యో వేద స మునిః శ్రేష్ఠ ఉచ్యతే॥—మహాభారతము

"మౌనముతోనున్న మానవుడు ముని కాడు. అరణ్యములో నున్నవాడుకూడ మునికాడు. స్వలక్షణమగు ఆత్మస్వరూపమును తెలిసికొనిన మానవుడు శ్రేష్ఠుడగు ముని."

మునిలక్షణములు పరాశరస్మృతియందు ఉన్నవి. చూడుడు:—

నివృత్తః సర్వతత్త్వజ్ఞః కామక్రోధవివర్జితః।
ధ్యానస్థో నిష్క్రియో దాన్తః తుల్యామృత్కాఞ్చనో మునిః॥

"నివృత్తిని పొందినవాడును, సర్వతత్త్వజ్ఞుడును, కామక్రోధ రహితుడును, ధ్యానము చేయువాడును, నిష్కర్ముడును, దాంతుడును, మృత్కాంచనములను సమానదృష్టితో చూచువాడును ముని అనబడును."

"పై చెప్పిన గుణములను ధారణచేసి వానితో బాటు వేదాంత శాస్త్రమును అభ్యసించవలెను. వేదాంతప్రక్రియచేతప్ప మరొకవిధముగా ఆత్మతత్త్వమును తెలిసికొనలేము. కావున కొంతవరకు శాస్త్రమును అభ్యసించవలెను. అనంతరము ఏకాంతమున కూర్చుండవలెను.

త్రిభువ:—శాస్త్రాభ్యాసముచేసి పండితుడను కావలెనను కోరిక నాకు లేదు. ప్రభుభజన చేయుటయే నాకోరిక.

స్వా. ప్ర. :—పండితుడవు కానిదే ఏమియు లాభము లేదు. పాండిత్యము కావలెను. మనుస్మృతియందలి పండితలక్షణము పరికించుము.

నిషేవతే ప్రశస్తాని నిన్దితాని న సేవతే,
అనాస్తికః శ్రద్దధానః ఏతత్పణ్డితలక్షణమ్॥

"స్తుతించదగిన సత్కార్యములను చేయుచు, నింద్యకర్మములను ఆచరించక, ఆస్తికుడయి శ్రద్ధావంతుడగు నరుడు పండితుడు."

స్తుతించదగిన సత్కార్యములను ఆచరించువాడు "అమానిత్వమదమ్భిత్వమ్" అని గీతలో చెప్పబడిన దైవసంపదకు చెంది శుభకార్యములనే ఆచరించును. నింద్యకర్మములను ఆచరించడు. దంభము, దర్పము, అభిమానము మొదలగు అసురసంపదకు ఆలవాలమగు అశుభ కర్మలను ఆచరించడు. అనాస్తికుడు అనగా ఈశ్వరుని అస్తిత్వమును అంగీకరించును. ఈశ్వరపరాయణుడయి ఈశ్వరప్రణీతములగు వేదశాస్త్రములయందు శ్రద్ధకలిగియుండి, "యోగక్షేమం వహామ్యహమ్" అని దేవుడు చెప్పినమాటలను పూర్తిగా నమ్మును. ఇట్టివాడు పండితుడు.

కొందరు గౌరవప్రతిపత్తులకొరకును, ధనసంపాదనమునకును, వ్యాకరణము, న్యాయము, వేదాంతము అభ్యసించి పండితులగుదురు. అట్టి పండితు లవమని నేను మీతో చెప్పుటలేదు. అయినను వేదాంత ప్రక్రియ కొంతవరకు నేర్చుకొని తీరవలెను. అని మాత్రము చెప్పుచున్నాను. అధ్యయనములేనిదే గురువుచెంత శ్రవణముచేసినంత మాత్రమున ఆత్మతత్త్వముయొక్క యథార్థరహస్యము తెలియరాదు.

అంతట శ్రీప్రకాశానందస్వామివారు అలసిపోవుటచే గోడను చేరబడిరి. ఇది చూచి త్రిభువనభాయి లోపలనుండి తలగడా తెచ్చి వెనుక చేర్చబోయెను. స్వామివారు సంజ్ఞచే వారించిరి.

స్వా. ని. :— నేను ఎన్నిమార్లో వారిని దిండుపై కూర్చొనమని చెప్పుచున్నాను. కాని వారు కూర్చొనుటలేదు.

స్వా. ప్ర. :— నేను ముష్టెత్తుకొనువాడను. నాకు దిండులు తలగడాలు తగునా? త్యాగికి దిండుపై కూర్చొనినను, గాడిదపై కూర్చొనినను రెండును సమానమే. శరీరము అను గాడిదపై కూర్చొనియే యున్నాను. కాళ్ళు కట్టిలేనందున ప్రభువునకు దయకలిగి గాడిదపైనుండి దింపిన దింపగలడు. పశుపక్ష్యాదుల కాళ్ళుకూడ కట్టివేయబడినవి. అవి పరాధీనజీవితము గడుపుచున్నవి. మానవుడు ఈ శరీరముననే కాళ్ళు కట్టివేయబడక స్వతంత్రుడుగా నున్నాడు. దిగదలచినచో దిగగలడు.

స్వా. ని.:— దిండ్లు మొదలగు ఆసనములు రాజులకు శోభించును. మాకు శోభించవు.

స్వా. ప్ర. :— చాలరోజులక్రితము నేను 'ఖంభాతు' వెళ్ళితిని. దివాను మాధవరావ్‌భాయి నాతో చెప్పెను:— "ఒకరోజున నేను [illegible]

పెట్టుటకు దిండు, తలగడ మొదలగు ఏర్పాట్లు చేసితిని. నవాబుగారు వచ్చి తివాసీపైన-క్రిందనే- కూర్చొనిరి."

అప్పుడు మాధవరామ్‌భాయి ఇట్లనెను:—

"నవాబ్ సాహబ్, తమరు దిండుపైన వేంచెయ్యండి."

నవాబు:— "అరే, దిండు ఖుదాకి"

అనంతరము ఆయనను ఎంతయో బ్రతిమాలి కూర్చుండబెట్ట వలసివచ్చెను. వారందరు రాజ్యకార్యనిమగ్నులయినను అంత సాత్త్వికత్వముతో నుండిరి. నాకు దిండ్లుపైన కూర్చొనుట చేతకాదు. నేను జారిపోవుదునేమో! శ్రీనిత్యానందులవారు నవ్వుచు ఇట్లు పలికిరి:—

"జారిపడిపోవుట" అనగా నేమియో తెలియునా? దిండ్లు మొదలగు ఉన్నతాసనములపై కూర్చొనినచో అభిమానము కలిగి పతితులగుట.

త్రిభువన:— అభిమాన మనగా నేమి?

శ్రీనిత్యానందస్వామివారు శ్రీప్రకాశానందస్వామివారినే చెప్పమనిరి.

స్వా. ప్ర. :— అభిమానమనగా అసురభావము. గీతయందు చెప్పబడినది కదా! "దమ్భో దర్పోఽభిమానశ్చ" అని. తన మహాత్త్వమును సిద్ధింపజేయుటకు జనులఎదుట ఎంతయో ధర్మాత్ముడుగా సంచరించుట దంభము. శ్రేష్ఠపురుషుల అవమానమునకు హేతుభూతమగు గర్వము దర్పము. తాను చాల పూజ్యుడ ననుకొనుట అభిమానము.

అభిమానమునుగురించి పారసభాగమున వ్రాయబడి ఉన్నది:—

ఇతరులకంటె తాను అధికుడను అనుకొనువాడును, తనఆధిక్యమును ప్రకటించువాడును అభిమాని అని తెలిసికొనవలెను. అభిమానులు ప్రభువును తెలిసికొనరు; వారు ఈశ్వరునికంటె తాము గొప్ప

వార మనుకొనెదరు. తాము అందరికంటె ముందు నడచెదరు. ఉన్నతస్థానమున కూర్చొన దలచెదరు. అందరినుండి గౌరవమును కోరెదరు.

ఒకసంతు చెప్పెను:— నరకమునకు పోవుమనుష్యుని చూడ వలెననియున్న తాను కూర్చొనియుండి అందరను నిలబెట్టు మనుష్యుని చూడుము. అభిమానులు తనకంటె గొప్పవారివద్దకు వెళ్లలేరు. దీనులను దరిచేర నివ్వలేరు. ఎవ్వరైన యథార్థమును ఉపదేశించినచో దానిని అంగీకరించలేరు. పైగా కోపించి, ఎవ్వరైన ఉపదేశించిన క్రోధముతో కూడిన పలుకులను పలికెదరు. అభిమానులు యథార్థమును పలుకు మానవుని ఎదుట, మహాత్ముని ఎదుట శిరమును వంచి నమస్కరించరు. జీవుల నన్నిటిని లీకదృష్టితో చూచెదరు. ఈస్వభావము జీవునకును, ఈశ్వరునకును మధ్య తెరవేయుటవంటిది. ఇందువలన అవగుణములు అన్నియు పుట్టి గుణము లన్నిటికిని దూరమగును. ఈర్ష్యచే ఆతని క్రోధము శాంతించదు. అందుచే ఆతడు ఎవనిని తనతో సమానుడుగా తలచడు. నిందా, కపటములనుండి విముక్తుడగుట కల్ల. ఈకారణముచే ఈలోకమునందును, పరలోకమునందును చాల దుఃఖమును అనుభవించును. అహంభావము విస్మరించనంత వరకు ధర్మము మచ్చునకైనను సమీపించదు. ఇద్దరు అభిమానులు కూడిన దుర్గంధము వ్యాపించును. వారి ఇరువురి హృదయములును లోలోన కుమిలిపోవును. అభిమానము రెండు రకములు. 1. దీర్ఘము 2. అల్పము. దీర్ఘాభిమాని తానే కర్తననియు, భోక్తననియు తలచును. ఆకారణముచే ఎవనియందును భక్తి కలిగియుండడు.

అల్పాభిమాని సంతులను చూచిన బాధపడును. ఈసంతు నీచకులమునకు చెందినవాడు. ఇతనికి ఎందుకు నమస్కారము చేయవలెను? సంతులుకూడ మనవలెనే తినుచు, త్రాగుచు ఉందురుకదా! వారికి నమస్కరించినందున ప్రయోజనమేమి? అని తలచును.

ఈ అల్పాభిమాని అనేకరకములుగా నుండును.

1. అభిమానముచే సంతుల ఐశ్వర్యమును తెలిసికొనఁడు. నిర్విచారుఁడగును.

2. సంతుల గొప్పతనము తెలిసికొనినను వారికి దాసుఁడు కాలేఁడు.

3. సంతులను గొప్పవారని తెలిసికొనును. కాని వారిదగ్గర తన గొప్పతనమును ప్రకటించును. కావున వారి యథార్థవాక్యములను అంగీకరించఁడు. తాను వారి యజమానిని అనుకొనును. చక్రవర్తినౌకరు సింహాసనముపై కూర్చుని చామరము వేయించుకొనిన దండనకు పాత్రుఁడగునట్లు ఇట్టి అభిమానికూడ దండనార్హుఁడు.

అభిమానోత్పత్తికి కల కారణములు ఏడు.

1. విద్య:—విద్యాభిమాని చదువురానివానిని పశువు అనుకొనును. ఆతఁడు తనను పూజించవలెననుకొనును.

2. తపోవైరాగ్యములు:—జనులందరు తన సేవచేసి కృతార్థులగుదురనియు, గృహస్థులు మాయలో పడిఉన్నారనియు, తాను ముక్తుఁడననియు తపశ్శాలి అనుకొనును. తపశ్శాలులు మూఁడు రకములు:—

(i) హృదయమునుండి అభిమానమును పోగొట్టలేరు. పైకి దీనత్వమును దరిద్రమును ప్రకటించెదరు.

(ii) హృదయమునుండి గొప్పతనము ప్రకటించకపోయినను కర్మలయందు అభిమానమును ప్రకటించెదరు. ఎట్లనిన:—అందరికంటె ముందు నడచుట, ఉన్నతాసనముపై కూర్చొనుట, ఎవరిని చూడకుండుట, కనుబొమ్మలను ఉన్నతములుగా నుంచుట మొదలగునవి.

(iii) తన నోటితోనే తనను స్తుతించుకొనెదరు. ఇతరులను తేలికగా చూచెదరు.

3. ఉత్తమకులము:—తాను కులీనుడను అనుకొనుట. అట్టి వారు సంతులు, తపశ్శాలులు, విద్వాంసులు మొదలగు వారిని అందరిని తమసేవకులతో సమాన మనుకొనెదరు.

4. సుందరరూపము :—రూపాభిమానము స్త్రీలయందు ఎక్కువగా నుండును.

5. ధనము:—ధనవంతుడు ఎవనిపైన కోపగించిన ఇట్లు చెప్పును :—"నాఎదుట నీవెంత? నీవంటినౌకర్లు అనేకమంది నాకు కలరు.

6. శరీరబలము:—దుర్బలుని చూచి బలవంతులు శరీరాభిమానమును ప్రకటించెదరు. పీలుపడినవారిని బాధించుటకు వెనుకాడరు.

7. బంధువులు, శిష్యులు, సేవకులు ఎక్కువమంది ఉండుట.

ఇట్టివారు తాము మనుష్యమాత్రుని తరింపజేసెద మనుకొనెదరు. చివరకు నరకమునకు పోయెదరు.

ఒకసంతు ఒకఅభిమాని గర్వముతో ఒడలు తెలియక సంచరించుట చూచి ఉపదేశించెను. "సోదరా! అట్లు సంచరించకుము."

అతడు చెప్పెను. "నీవు నన్ను ఎరుగవు."

సంతు:— నిన్ను నేను బాగుగా ఎరుగుదును. నీవు మొదట జలబిందువుగా నుండువాడవు. మధ్యకాలమున మలరాశిని మోయువాడవు. చివరకు మహామృత్యువును పొందెదవు.

అభిమానము బ్రహ్మవిద్యకు మిక్కిలి విఘ్నము కలిగించును. అందుచే సాధకుడు అభిమానరహితులుగా నుండవలెను.

పారస భాగమున చెప్పబడినది:—

ఒకసంతుని జనులెల్లరు కలసి ఉన్నతస్థానమున కూర్చుండబెట్ట బోయిరి. "నేను ఇచ్చట కూర్చుండుట తగదు. ఇక్కడ కూర్చొనుటచే నేను అందరికంటెను గొప్పవాడను అనుభావము కలుగును." అట్టి ఉత్తమవ్యక్తులే అభిమానసంకల్పమును పోగొట్టుకొనలేకపోయినప్పుడు నావంటి అల్పబుద్ధికలవాడు ఎట్లు దానిని జయించకలడు?

అక్కడనే మరియొక దృష్టాంతముకూడ కలదు:—

"ఒకసంతు అగు రాజు తనరాజ్యమున సంచరించుచుండెను. ఆతడు ధనవంతులతో తక్కువ మాట్లాడెడివాడు. తానుకూడ దరిద్రుడనే అనియు, అందుచేతనే జనులెల్లరు దరిద్రులుగా నున్నారనియు చెప్పెడివాడు"

పూర్వము ఉండెడి శ్రీమంతులు, రాజులు దైవసంపద కలిగియుండెడివారు. వారికి అభిమానాది అసురసంపద ఉండెడిది కాదు. ప్రభుభజన చేసెడివారు.

అంతట త్రిభువనభాయి అడిగెను. "దైవగుణములను పొందుటకు ఏమి చేయవలెను?"

స్వా. ప్ర. :- గీత 13వ అధ్యాయమునందలి "అమానిత్వ" మొదలుకొని ఉన్న శ్లోకములను అయిదింటిని ప్రతిరోజు పారాయణముచేసి వానిపై ఆలోచించుచుండుము. ఆశ్లోకములు సాక్షాత్తు శ్రీమన్నారాయణుని శ్రీముఖమునుండి వెలువడినవి. శ్రద్ధాభక్తులతో వానిని ధారణచేయుము. అప్పుడు దైవసంపద కలుగుటకు ఆలస్యము కాదు.

—X—